నమస్తే తెలంగాణ

ములుగు జయశంకర్ భూపాలపల్లి

5 | వరంగల్, శనివారం 7 సెప్టెంబర్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

రావయ్యా.. గణపయ్యా

- నవరాత్రోత్సవాలకు ఊరూవాడా సిద్ధం
- వాడవాడలా కొలువుదీరనున్న నాయకులు
- నేడు వినాయక చవితి

రెడ్డికాలనీలోని మండపంలో వినాయకుడు

హనుమకొండ చౌరస్తాలో పూజ సామగ్రి, వినాయకులను కొనుగోలు చేస్తున్న భక్తులు

నర్సంపేట రూరల్, సెప్టెంబర్ 6 : గణపతి నవరాత్రోత్సవాలకు ఊరూవాడా సిద్ధమైంది. ఆదిదేవుడు విఘ్నేశ్వరుడు కొలువయ్యే వేళ రానే వచ్చింది. శనివారం వినాయక చవితిని పురస్కరించుకొని వాడవాడలా గణనాథులు కొలువుదీరనుండగా తొమ్మిది రోజుల పాటు పూజా కార్యక్రమాలు, ప్రత్యేక అలంకారాలు, భక్తి గీతాలతో మండపాల వద్ద సందడి నెలకొంది. ఇందుకోసం వారం ముందునుంచే నిర్వాహకులు మండపాలు ఏర్పాటు చేసి, విద్యుత్ దీపాలు, డెకరేషన్స్‌తో అలంకరించి సిద్ధం చేశారు. ఈ సందర్భంగా విగ్రహాలు, పూజ సామగ్రి కొనుగోళ్లతో జిల్లాకేంద్రాలు, పట్టణాల్లోని మార్కెట్లన్నీ కిటకిటలాడాయి.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం

గణపతిని తొలుత ఆరాధించడం వల్ల చేపట్టిన కార్యాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా జరగడమే కాక విజయంతో పాటు గమ్యాన్ని, లక్ష్యాన్ని పొందవచ్చనేది ప్రజల విశ్వాసం. విఘ్నాలు తొలగించే దేవుణ్ణి కొలిచేందుకు ప్రకృతికి ఎన్నో విఘ్నాలు కలిగిస్తున్నాం. అంతేకాదు వాటిని నీటిలో నిమజ్జనం చేయడంతో నీరు కలుషితమవుతోంది. మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం. మట్టి విగ్రహాలతో పాటు పూజించిన పత్రాలను నీటిలో వేయడం వల్ల విగ్రహం మెల్లగా కరిగి నీటిలో కలిసిపోతుంది. పత్రాలన్నీ ఆయుర్వేద, ఔషధ గుణాలు కలిగినవే. అవి 23గంటల వ్యవధి తర్వాత వాటిలోని ఔషధ గుణాలు, ఆల్కలాయిడ్స్‌ను ఆ జలంలోకి వదిలేస్తాయి. బ్యాక్టీరియాను నిర్మూలించి, జలాల్లో ఆక్సిజన్ శాతాన్ని పెంచుతాయి. ఫలితంగా నీరు శుద్ధి అవుతుందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.

వరద బాధితులకు భరోసా ఏదీ?

ధ్వంసమైన అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

- ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- సర్వం కోల్పోయినా రూ. పదివేలు ఇస్తామనడం కరెక్ట్ కాదు
- ఇంత వరకు నష్టం అంచనా వేయని సర్కారు
- వెంటనే పరిహారం అందించి న్యాయం చేయాలి
- మల్కాజిగిరి ఎంపీ రాజేందర్

మహబూబాబాద్ రూరల్/తాడ్వాయి/గోవిందరావుపేట/మరిపెడ, సెప్టెంబర్ 6: రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మ ల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ శివారులోని బీజేపీ జిల్లా కార్యాల యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖమ్మం, మానుకోట జిల్లాలను భారీ వర్షం అతలాకుతలం చేసిందని, నిరుపేదలు, రైతులు ఇబ్బందులు పడుతుంటే కాంగ్రె స్ సర్కారు వారికి ధైర్యం కల్పించి ఆదుకోవడం మరిచిందన్నారు. ఇంత వరకు ఎంత నష్టం జరిగిందనే అంచనా వేయలేదన్నారు. సర్వం కోల్పోయిన వారికి కూడా సీఎం రేవంత్‌రెడ్డి రూ.10 వేలు నష్టపరిహారం చెల్లిస్తామని అన డం ఎంతవర కు కరెక్ట్ అని అన్నారు. జిల్లాలో సీతానగరం తండా, రావిరాల గ్రామంలో ప్రజలు తినడానికి ఆహారం లేక ఇబ్బంది పడుతున్నారని, వెంటనే వారికి సహాయ సహకారాలు అందించాలన్నారు. బాధితులకు పరిహారం అందించి న్యాయం చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలకు కేంద్రమే నిధులివ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం బురద జల్లే ప్రయత్నాలు చేస్తుందని, వెంటనే మానుకోవాలన్నారు. వరద బాధితులకు ఎల్లప్పుడూ కేంద్రం అండగా ఉంటుందన్నారు.

విధ్వంసానికి గురైన అటవీ ప్రాంతం సందర్శన

తాడ్వాయి మండలంలోని మేడారం దారిలో సుడిగాలి సృష్టించిన విధ్వంసంతో 500ఎకరాల్లో ధ్వంసమైన అటవీ ప్రాంతాన్ని బీజేపీ నాయకులతో కలిసి ఈటల సందర్శించారు. ఎన్ని చెట్లు నేలకూలాయి? దేని కారణంగా అడవి ధ్వంసమైందనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా 163వ జాతీయ రహదారిలోని జనగలంచ వాగును పరిశీలించారు. అనంతరం పిడుగు పాటుకు గురై మృతి చెందిన నార్లాపురానికి చెందిన మహేశ్ కుటుంబాన్ని పరామర్శించారు. తిరుగుప్రయాణంలో బాంబుల ఒర్రెను పరిశీలించారు. గోవిందరావుపేట మండలంలోని పస్రా సమీపంలోని గుండ్లవాగు వద్ద పడిన రోడ్డు కోతను, ఇసుక మేటలు వేసిన పంట పొలాలను పరిశీలించారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర నాయకుడు గరికపాటి మోహన్‌రావు, బీజేపీ శాసన సభా పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, పార్టీ జిల్లా అధ్యక్షులు వైవీ రావు, బలరాం, మాజీ ఎంపీ సీతారాంనాయక్, నాయకులు ధర్మారావు, యాప సీతయ్య, మోసంగి మురళి, శశిధర్‌రెడ్డి, మదన్, సతీశ్, నాగమణి, ఇందుభారతి, అజ్మీరా ప్రహ్లాద్, జాడి వెంకట్, ఏనుగు రవీందర్‌రెడ్డి, కర్ర సాంబశివుడు, నామవరపు విజయలక్ష్మి ఉన్నారు.

కొనసాగుతున్న అటవీ అధికారుల సర్వే

జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం దారిలో గత వారం సుడిగాలి సృష్టించిన విధ్వంసంలో నష్టంపై అటవీ శాఖ అధికారుల సర్వే కొనసాగుతున్నది. ఏ జాతికి చెందిన చెట్లు, వయసు ఎంత ఉంటుంది అనే అంశాలను అంచనా వేయనున్నారు. సర్వేను డీఎఫ్‌వో, ఎఫ్‌డీవోలు పర్యవేక్షిస్తున్నారు. సర్వే పూర్తి అయిన అనంతరం చెట్లను టింబర్ డిపోకు తరలించి టెండర్ వేయనున్నట్లు అధికారులు తెలిపారు.

వరద విలయానికి అంతా తారుమారు

- నామరూపాల్లేకుండా చెరువులు, పంట చేలు
- కొట్టుకొచ్చిన ఇసుక, కంకర కుప్పలు
- మానుకోట జిల్లాలో 85 చెరువులకు గండ్లు
- ఖాళీ అయిన జల వనరులు
- ఒక్కో రైతుకు లక్షల్లో నష్టం
- సాగుకు అనుకూలంగా మార్చేదెవరు?
- ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్

వరద పోటుకు పంట చేలు, చెరువులు నామరూపాల్లేకుండా మారాయి. అతి భారీ వర్షాలతో పాలాల్లో ఇసుక మేటలు, తారురోడ్డు ముక్కలుచెక్కలై కొట్టుకొచ్చాయి. ప్రవాహ ఉధృతికి చెరువులకు గండ్లు పడి నీరంతా వృథా పోవడంతో నేలంతా మైదానంలా మారి పెద్ద పెద్ద రాళ్లు తేలాయి. ఇలా మొన్నటి ప్రకృతి బీభత్సానికి మానుకోట జిల్లాలో 85 చెరువులు తెగిపోవడంతో జలవనరులన్నీ ఖాళీ కాగా, చాలాచోట్ల పంటలను ముంచేసి, ఇసుక మేటలు వేసి రైతన్నకు అపార నష్టం మిగిల్చింది. పంటలను కోల్పోయి, సాగుభూమి అక్కరకు రాకుండా కావడం అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. ఇప్పటికే దీంతో ఒక్కో రైతుకు లక్షల్లో నష్టం వాటిల్లిన నేపథ్యంలో ప్రభుత్వమే ఆదుకోవాలని రైతాంగం డిమాండ్ చేస్తున్నది.

- మహబూబాబాద్, సెప్టెంబర్ 6(నమస్తే తెలంగాణ)

నెల్లికుదురు: రావిరాలలో కోమటికుంట చెరువు తెగి వృథాగా పోతున్న నీరు

నెల్లికుదురు మండలం ఆలేరు పెద్ద చెరువు తెగిపోవడంతో సుమారు 10 ఎకరాల్లో కుప్పలు కుప్పలుగా పడి ఉన్న చెరువులోని పెద్ద రాళ్లు

పొలాలను ముంచేసి రాళ్లతో నింపేసి..

భారీ వర్షాలతో మానుకోట జిల్లాలో గ్రామాలు, తండాలపై తీవ్ర ప్రభావం చూపింది. ఇప్పటికే చాలాచోట్ల ఇళ్లు కూలిపోయి, కొన్ని బురద నీటి పాలు కాగా సామగ్రి, నిత్యావసరాలు, పశువులు, గేదెలు, గొర్రెలన్నీ వరద పాలయ్యాయి. వరదలతో జిల్లాలో 85 చెరువులు గండ్లు పడ్డాయి. వీటిలో 40 పూర్తిగా తెగిపోయాయి. అలాగే చెలకల్లోకి ఉప్పెనలా వచ్చిన వరదతో పత్తి, మిర్చి, వరి, మక్కజొన్న తదితర పంటలన్నీ కొట్టుకుపోయాయి. పొలాల్లో ఇసుక మేటలు, రాళ్లు వచ్చి చేరి లక్షలు పోసి పెట్టుబడి పెట్టిన రైతులకు అంతులేని నష్టాన్ని మిగిల్చింది. వాటిని తొలగించి, సాగుకు అనుకూలంగా మార్చుకోవడం రైతులకు కత్తి మీద సామూలా మారింది. వీటిని రైతులు తొలగించాలంటే ఖర్చుతో కూడిన పని. వరద నష్టంపై అధికారులు, ప్రజాప్రతినిధులు తాత్కాలిక ఉపశమనం కోసం ఓదార్చడం తప్ప వారు కన్నీళ్లు తుడిచింది లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎకరాకు లక్షల్లో పెట్టుబడి పెట్టిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం కింద ఎకరాకు చెల్లిస్తామని చెప్పిన రూ.10వేలు ఏ మూలకు సరిపోతాయని రైతులు ప్రశ్నిస్తున్నారు.

రూ.10 వేలు ఎటూ సరిపోవు..

ఆకేరు వాగు వరదతో సర్వం కోల్పోయాం. రెండు ఎకరాల మిర్చి తోట, ఒక ఎకరం వరి వేశాను. పంటతో పాటు బావి వద్ద ఉన్న 40 పైపులు, 10 ఎరువుల బస్తాలు కొట్టుకుపోయాయి. మాకు జీవితంలో కోలుకోలేని దెబ్బ తగిలింది. లక్షల పెట్టుబడి వరద పాలైయింది. రైతులకు తీవ్ర నష్టం జరిగింది. ప్రభుత్వం వెంటనే పంట నష్ట పరిహారం చెల్లించాలి. అరకొరగా పరిహారం ఇస్తే ఏమి సరిపోతుంది.

- జాటోత్ మంగమ్మ, రైతు, దుబ్బతండా, డోర్నకల్ మండలం

కాటారం సబ్ కలెక్టర్‌గా మయాంక్‌సింగ్ బాధ్యతల స్వీకరణ

మయాంక్‌సింగ్

కాటారం, సెప్టెంబర్ 6 : మండలకేంద్రంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యాలయంలో కాటారం సబ్ కలెక్టర్‌గా మయాంక్ సింగ్ శుక్రవారం బాధ్యతల స్వీకరించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి డివిజన్ నైసర్గిక స్వరూపాన్ని తెలుసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో పాటు కార్యాలయ అధికారులు, సిబ్బంది చేపట్టాల్సిన విధి నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఆయనను డివిజన్, మండల స్థాయి అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. బొకేలు అందించి శాలువాలతో సన్మానించారు. సబ్ కలెక్టర్‌ను కలిసిన వారిలో డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్, తహసీల్దార్లు నాగరాజు, రవికుమార్, అనిల్, కాటారం ఎంపీడీవో అడ్డూరి బాబు, ఎంపీవో వీరస్వామి, ఆర్ఐ వెంకన్న, కాటారం కార్యదర్శి సఫీర్‌ఖాన్ ఉన్నారు.

1540 ఎకరాల్లో పంట నష్టం

- 35 గ్రామాల్లో దెబ్బతిన్న పంటలు
- ప్రభుత్వానికి నివేదించిన వ్యవసాయశాఖ

ములుగు, సెప్టెంబర్ 6(నమస్తేతెలంగాణ) : భారీ వర్షాల కారణంగా ములుగు జిల్లాలోని మూడు మండలాల పరిధి 35గ్రామాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి. సురేశ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల కారణంగా మూడు రోజులపాటు ఏకధాటిగా కురిసిన వానలతో జిల్లాలోని గోవిందరావుపేట, ఏటూరునాగారం, తాడ్వాయి మండలాల్లో వరి పంటలు నీట మునిగి ఇసుక మేటలు వేశాయన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి 33శాతం కంటే ఎక్కువ పంట నష్టం జరిగిన రైతుల వివరాలను సేకరించి ప్రాథమిక అంచనాకు వచ్చి ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు తెలిపారు. గోవిందరావుపేట మండలంలో 485మంది రైతులకు చెందిన 610ఎకరాల వరి పంట దెబ్బతినగా ఏటూరునాగారం మండలంలో 20మంది రైతులకు చెందిన 30ఎకరాల వరి పంట నీట మునిగిందని అన్నారు. తాడ్వాయి మండలంలో అత్యధికంగా 625మంది రైతులకు చెందిన 900ఎకరాల వరి పంట నీట మునిగి పంట నష్టం జరిగిందన్నారు. ఈ మేరకు శుక్రవారం నివేదికను ప్రభుత్వానికి పంపించినట్లు ఆయన తెలిపారు.